andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7 | కనిష్ఠం 14.9
నిర్మల్ జిల్లా వార్తలు




జిల్లాలో పెరిగిన చలితీవ్రత

నిర్మల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం 14 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో జనం పెరిగిన చలితీవ్రతతో గజగజ వణికిపోతున్నారు. చలితీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోజురోజుకు వాతావరణం చల్లగా మారుతుంది. దీంతో జనం ఉదయం 9 గంటల వరకు ఇళ్ల నుంచి అత్యవసరమైతే తప్ప బయటకు రావడం లేదు. సాయంత్రం 4 గంటల నుంచే వాతావరణం చల్లగా మారుతుండడంతో ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. వెచ్చని స్వెట్టర్లు ధరిస్తున్నారు. చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

బాసర డబ్లింగ్‌కు లైన్ క్లియర్







బాసర వద్ద గోదావరి నదిపై ప్రస్తుతం ఉన్న రైల్వే బ్రిడ్జి



- భూ సేకరణకు గెజిట్ విడుదల
- చివరిదశకు చేరుకున్న ప్రక్రియ.. తరువాయి పనులు ప్రారంభమే
- కొత్త లైన్ నిర్మాణానికి ఇప్పటికే రూ. 5 వేల కోట్ల కేటాయింపు
- త్వరలో జిల్లా వాసులకు మెరుగుకానున్న రైలు సౌకర్యం
- బాసరకు భక్తుల తాకిడి పెరిగే చాన్స్

నిర్మల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాసర మీదుగా రైల్వే డబ్లింగ్‌లైన్‌కు లైన్‌క్లియర్ అయింది. కొత్త లైన్ ఏర్పాటులో కీలకమైన భూసేకరణకు రైల్వేశాఖ గెజిట్ విడుదల చేసింది. జిల్లాలో సుమారు 12 కిలోమీటర్ల పొడవులో రెండెకరాలకు పైగా భూమి అవసరం ఏర్పడింది. ఈ భూసేకరణకు రైల్వేశాఖ ఈ నెల 22వ తేదీన గెజిట్‌ను విడుదల చేసింది. ఎప్పటి నుంచో ఈ లైను డబ్లింగ్ కోసం ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రతీసారి ఆలస్యమవుతూ వస్తుంది. 2023-24 రైల్వేబడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం డబ్లింగ్ నిర్మాణం కోసం రూ.5 వేల కోట్లను కేటాయించింది. ఇందులో భాగంగానే అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసింది.

• దోన్ - ముత్కేడ్ రూ. 5 వేల కోట్లు మంజూరు

కర్నూలు జిల్లా దోన్ - మహారాష్ట్ర ముత్కేడ్ వరకు డబ్లింగ్ లైన్ కోసం రైల్వేశాఖ రూ. ఐదున్నర వేల కోట్ల కేటాయించింది. 2023-24 బడ్జెట్‌లో కేటాయించిన ఈ నిధులతో ఇప్పటికే భూసేకరణ అవసరం లేని చోట్ల పనులు ప్రారంభించారు. కల్వర్టులు, భూమి చదును వంటి నిర్మాణ పనులు అనేక చోట్ల ప్రారంభమయ్యాయి. 550 కిలో మీటర్ల పొడవునా ఈ లైను అందుబాటులోకి వస్తే రైల్వే శాఖలో అత్యవసర సమయాల్లో రైళ్ల మళ్లింపుకు మరో మార్గం అందుబాటులోకి రానుంది.

• భూసేకరణకు పూర్తయిన సర్వే

జిల్లాలో బాసర వద్ద సుమారు 12 కిలోమీటర్ల రైల్వే లైన్ ఉంది. డబ్లింగ్ లైన్ కోసం రెండెకరాలకు పైగా భూమి అవసరం ఏర్పడింది. ఇప్పటికే బాసర మండల రెవెన్యూ అధికారులు సర్వే చేసి నివేదిక ఇచ్చారు. బాసర, రవీంద్రపూర్ రెండు గ్రామాల పరిధిలో 41 మంది రైతులు తక్కువ విస్తీర్ణంలో తమ భూములు ఇవ్వాల్సి ఉంది. వీరికి రైల్వేశాఖ నష్టపరిహారం కూడా చెల్లించనుంది.

• అభ్యంతరాల స్వీకరణకు నోటిఫికేషన్

భూమి సేకరణకు ఈ నెల 22వ తేదీన రైల్వేశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. భూములు కోల్పోయే రైతుల నుంచి అభ్యంతరాలను, ఫిర్యాదులను స్వీకరించేందుకు అవకాశం ఉంది. భైంసా ఆర్డీవో భూ సేకరణ అధికారిగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేసి భైంసా ఆర్డీవో త్వరలో రైతుల అభిప్రాయాలను సేకరించి నివేదించనున్నారు.

• మెరుగు కానున్న రైల్ సౌకర్యం

బాసర మీదుగా రెండో రైల్వే లైన్ పూర్తయితే నిర్మల్ జిల్లా వాసులకు రైల్ సౌకర్యం మెరుగుపడనుంది. ఈ ఏడాదే ఇప్పుడు ప్రస్తుతం ఉన్న లైను ఎలక్ట్రికల్ లైన్‌గా మార్చి ప్రారంభించారు. మరో లైన్ ఏర్పాటయితే ప్రస్తుతం 50 ట్రైన్‌లు రాకపోకలు సాగిస్తుండగా ఈ సంఖ్య రెట్టింపు కానుంది. దేశంలో ఏ ప్రాంతానికైనా సులువుగా తక్కువ ధరలో వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. ఇది ఉద్యోగులు, వ్యాపారస్తులు అన్ని వర్గాలకు సౌకర్యంగా మారనుంది. రైల్వేశాఖకు కూడా అనుకోని అత్యవసర సమయాల్లో రైళ్ల మళ్లింపునకు ప్రధానమార్గంగా మారనుంది. రెండో లైన్ అందుబాటులోకి వస్తే బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరగనుంది. ఈ చుట్టు పక్కల రాష్ట్రాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చేందుకు సదుపాయం కలగనుంది. ఇప్పటికే బాసరకు వచ్చే యాత్రికులు సగం మంది రైళ్ల ద్వారానే వస్తున్నారు. మేడ్చల్ నుంచి కేవలం ఒకే లైన్ ఉండటంతో క్రాసింగ్‌ల వల్ల ప్రయాణ సమయం పెరిగిపోతోంది. ఇక ఆ సమస్య తీరనుంది. నాందేడ్ డివిజన్‌లో బాసర రైల్వేస్టేషన్ నుంచి రూ. కోట్లలో ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం ఈ మార్గంలో సగటున రోజుకు 50 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. కొత్త లైన్ ఏర్పాటయితే ఈ రైళ్లసంఖ్య రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయి. బాసర అమ్మవారి ఆలయ సందర్శకుల సంఖ్య కూడా అలాగే పెరిగిపోతుంది. ఇప్పుడు బాసరకు వచ్చిన యాత్రికు తిరిగి వెళ్లాలంటే సరైన సమయానికి రైళ్లు లేవు. గంటల తరబడి లేదంటే రోజు తరబడి వేచి చూడాల్సి వస్తుంది. సింగిల్ లైన్ కావడంతో రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులన్నీ రెండో లైన్ నిర్మాణంతో తొలగిపోతాయి. అదేవిధంగా ప్రముఖ పుణ్యక్షేత్రం షిర్డీకి ప్రతీరోజు బాసర మీదుగా 8 రైళ్లు నడుస్తున్నాయి. వీటి సంఖ్య పెరగనుంది. తెలుగు రాష్ట్రాల నుంచి షిర్డీకి వెళ్లే భక్తులు తిరుగు ప్రయాణంలో బాసర అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇలా ఏరకంగా చూసినా బాసరకు భక్తులు పెరిగే చాన్స్ ఎక్కువ ఉంది.

• గోదావరిపై నాలుగో వంతెన

ప్రస్తుతం బాసర వద్ద గోదావరిపై రోడ్డుమార్గం కోసం ఒకటి, రైలుమార్గం కోసం మరొకటి వంతెనలు ఉన్నాయి. ఈ రెండింటితో పాటు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మరో రోడ్డు మార్గం వంతెన నిర్మాణం జరుగుతుంది. ఒకటి రెండు నెలల్లో ఇది అందుబాటులోకి రానుంది. కొత్తగా ఏర్పడే రెండో రైల్వేలైన్ నిర్మాణం కోసం మరో వంతెనను నిర్మించనున్నారు. ఈ కొత్తది ఏర్పటయితే బాసర వద్ద గోదావరి నదిపై నాలుగు వంతెనలు అందుబాటులోకి రానున్నాయి.

త్వరలో రైతుల అభిప్రాయాలు తీసుకుంటాం

రైల్వేశాఖ డబ్లింగ్‌లైన్ కోసం భూ సర్వే నిర్వహించి నివేదించాము. బాసర, రవీంద్రపూర్ రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతుల భూములు కొంత మేరకు సేకరించాల్సి వస్తుంది. భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. రైతుల నుంచి అభిప్రాయాలను సూచనలను స్వీకరిస్తాం. రైతులకు ప్రత్యేకంగా నోటీసులతో సమాచారం ఇచ్చి త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తాం.

(ఆర్డీవో, కోమల్‌రెడ్డి)

పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని

పెంబి మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగి పూర్ణచందర్‌గౌడ్ ఆత్మహత్యా యత్నం
- జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు
- రూ. 30 లక్షల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నాయని సన్నిహితుల ఆవేదన

ఖానాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రతినిధిగా ఎన్నికైనందుకు తన హయాంలో ప్రజలకు ఏదైనా చేయాలనే తపనతో పలు అభివృద్ధి పనులను నిర్వహించిన ఓ మాజీ సర్పంచ్ తన పదవీకాలం ముగిసినా ప్రభుత్వం నుంచి బిల్లుల డబ్బు రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... పెంబి సర్పంచ్‌గా పదవీ బాధ్యతలను నిర్వర్తించిన అరుగుల పూర్ణచందర్‌గౌడ్ అలియాస్ శేఖర్‌గౌడ్ అనే వ్యక్తి తన పదవీ కాలంలో అనేక అభివృద్ధి పనులను నిర్వహించారు. ఈ అభివృద్ధి పనులు నిర్వహించగానే బిల్లులు వస్తాయని ఆశించి అప్పు తెచ్చి మరీ పనులు చేశాడు. కాగా తన పదవీకాలం ముగిసినా అభివృద్ధి పనుల తాలూకు బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో ఆ బిల్లుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగాడు. రెండు రోజుల క్రితం సైతం హైదరాబాద్‌లోని ఓ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లిన పూర్ణచందర్‌గౌడ్ తన బిల్లులను మంజూరు చేయాలని అక్కడ ఉన్న అధికారులను బ్రతిమాలాడు. రెండు రోజులాగి రావాలని సదరు అధికారి చెప్పడంతో తిరిగి వచ్చి నిర్మల్‌లోని తన బంధువుల ఇంట్లో ఉన్నాడు. బుధవారం మధ్యాహ్నం సదరు అధికారికి ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఓవైపు పనుల నిర్వహణ కోసం తెచ్చిన అప్పులు మెడ మీద కత్తిలా వేలాడుతుండడం మరోవైపు బిల్లులు రాకపోవడంతో అప్పుల వాళ్లకు సమాధానం చెప్పలేక పూర్ణచందర్‌గౌడ్ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. దీంతో అతడిని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పూర్ణచందర్‌గౌడ్ చికిత్స పొందుతున్నాడు. పూర్ణచందర్‌గౌడ్‌కు రూ. 30 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన స్పృహలో లేకపోవడంతో పూర్తి వివరాలు తెలియరాలేదు.

రైలు కింద పడి ఒకరికి గాయాలు

బాసర, నవంబర్, 27 : (ఆంధ్రజ్యోతి) : బాసర రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరు తీవ్రగాయాల పాలయ్యారు. నాందేడ్ నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు ఎక్కే ప్రయత్నంలో కాలుజారి కిందికి పడిపోయాడు. అప్పుడే రైలు కదలడంతో తల చేతులు శరీర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే జీఆర్‌పీ పోలీసులు గమనించి బాధితుని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు మహారాష్ట్రకు చెందినట్లు తెలిసింది.

గోదారమ్మకు హారతి

బాసర, నవంబర్, 27 : (ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద గోదారమ్మకు బుధవారం దేవస్థాన పండితులు హారతి పూజ ఘనంగా నిర్వహించారు. స్నానఘట్టం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం దాదాపు గంటపాటు నదిమ్మ తల్లికి వివిధ హారతిలతో మంత్రోశ్చరణాల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఆర్టీసీ ప్రగతికి ఉద్యోగులు కృషి చేయాలి

● రీజినల్ మేనేజర్ సోలమన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఎం

భైంసా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరూ అంకితభావంతో విధులను నిర్వర్తిస్తూ సంస్థ ప్రగతికి బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని అర్‌టీసీ ఆదిలాబాద్ రీజియన్ మేనేజర్ సోలమన్ పిలుపునిచ్చారు. బుధవారం భైంసా డిపో పరిధిలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజనాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల చేతిలో సంస్థ భవితవ్యం ఆధారపడి ఉంటుందని వివరించారు.ప్రయాణీకులతో మమేకమై ఆదాయం పెరిగేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అర్‌టీసీ ఉద్యోగులతో పాటు వారి జీవిత భాగస్వాములకు వన భోజనాలను అందించారు. ఇందులో భాగంగా వారందరికి ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. ఇందులో డిప్యూటీ రీజియన్ మేనేజర్ ప్రణీత్, డిపో మేనేజర్ హరి ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సూపరిండెంట్ విలాస్ తోపాటు డిపో పరిధిలోని అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బాసర అమ్మవారి దర్శనానికి రండి

● ప్రధానిమోదీకి ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ ఆహ్వానం



ప్రధాని మోదీని కలిసిన బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం

భైంసా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి కొలువైన బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి రావాల్సిందిగా ప్రధాని నరేంద్రమోదీని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్‌పాటిల్ ఆహ్వానించారు. బుధవారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందంతో ప్రధాని మోదీని ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ కలిసారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీని బాసర అమ్మవారి దర్శనానికి రావాల్సిందిగా ఆహ్వానించినట్లుగా ఇక్కడి విలేకరులకు ఎమ్మెల్యే రాంరావ్‌పాటిల్ ఫోన్ ద్వారా మాట్లాడి తెలిపారు. అంతేకాకుండా నియోజక వర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు అధికమొత్తంలో కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లుగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ నియోజకవర్గంపై వివక్షత చూపుతూ పక్షపాతధోరణి విధానాలను అవలంబిస్తోందని తెలిపినట్లుగా పేర్కొన్నారు. ముథోల్ నియోజకవర్గంపై ప్రత్యేకదృష్టి సారించి ఆదర్శ అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని, ఇదే క్రమంలో అంతరాష్ట్ర రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని కోరినట్లుగా వెల్లడించారు. బాసర అమ్మవారి దర్శనంతో పాటు నిధుల మంజూరి విషయంలో ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించినట్లుగా ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ తెలిపారు.

సూక్ష్మపోషకాల వాడకంతో అధిక దిగుబడులు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

సోన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సూక్ష్మ పోషకాల వాడకంతో పంట పొలాల్లో రైతులు మంచి దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్ అన్నారు. సోన్ మండలంలోని సిద్దులకుంట గ్రామం లో బుధవారం ఏరిస్ కంపెనీ ఫౌండేషన్ డే సందర్భంగా రైతులకు అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... సూక్ష్మ పోషకాలైన జింక్, బోరాన్, ఐరన్, క్లోరిన్, అల్యూమినియం, మాంగనీస్, మాలిబ్డినం, కోబాల్ట్, కాపర్, తదితర వంటివి పంటకు ఉపయోగించాలని, రైతులు ఆ దిశగా ఆలోచించాలన్నారు. అదే విధంగా అధిక నత్రజని ఎరువులను తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ భాస్కర్, ఏవో వినోద్ కుమార్, ఏఈవోలు అశోక్ కుమార్, అంబాజీ, ప్రగతి, ఉమామహేశ్వరి, కంపెనీ ప్రతినిధులు రామకృష్ణరావు, రైతులున్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

● డీఈవో రామరావ్



భైంసా శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో రామరావ్

భైంసా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని డీఈవో రామరావ్ పేర్కొన్నారు. బుధవారం భైంసాలోని సుభద్ర వాటిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో న్యాక్ పరీక్ష ఇన్విజిలేటర్ల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం పాఠశాల పదవ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరీక్షల సమయం అసన్నమైన దృష్ట్యా ఉత్తమ ఫలితాల కోసం ఏకాగ్రతతో సాధన చేయాలని సూచించారు. జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ లక్ష్యసాధన కోసం పాఠశాల స్థాయి నుంచే ప్రణాళికతో పయనించాలని తెలిపారు. ఇందులో సెక్టోరియల్ అధికారి నర్సయ్య, భైంసా మండల విద్యాధికారి సుభాష్‌లతో పాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

బాసర, నవంబర్, 27 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరసతీ అమ్మవారి సన్నిధిలో చిన్నారుల కూచిపూడి, భరతనాట్య నృత్యం అందరిని ఆకట్టుకుంది. హైదరాబాద్, తెనాలి, విజయవాడ నుండి వచ్చిన చిన్నారులు అమ్మవారి నిలయంలో వివిధ భక్తి పాటలపై చేసిన నృత్యాలు అందరిని అబ్బురపరిచాయి. సాక్షాత్తు సకల కళలకు ఆదిదేవత అయిన సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ప్రదర్శన ఇవ్వడం ఆనందంగా ఉందని నృత్యకారులు అన్నారు.

'ఎస్సీ వర్గీకరణ తక్షణమే నిలిపి వేయాలి'

పెంబి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ తక్షణమే నిలిపి వేయాలని మాల ఉప కుల మండల కన్వీనర్ మల్లపల్లిస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో డిసెంబరు 1న జరిగే ఎస్సీ మాల ఉప కుల సమావేశానికి అధికసంఖ్యలో హాజరు కావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ తక్షణమే నిలిపి వేయాలని, నిలిపి వేయకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నిర్మల్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన నారాయణ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని బుధవారం బీజేపీ నాయకుడు సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. మనోధైర్యాన్ని కల్పించారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలి

నిర్మల్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని మాజీ ఎంపీపీ వి.సత్యనారాయణగౌడ్ సూచించారు. బుధవారం సోన్ మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ప్రతిబూత్‌కు 200ల మందిని సభ్యులుగా చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. దళితమోర్చా అధ్యక్షులు సాగర్, నాయకులు మార గంగారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాసరలో నాలుగిల్లో చోరీ



బాసర, నవంబర్, 27: (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలో దొంగలు నాలుగిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బస్టాండ్ సమీపాన గల వెంకటేశ్వర కాలనీలో నాలుగిళ్లలో తలుపులు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. ఇళ్లలో పూర్తిగా వెతికి అందినకాడికి పట్టుకెళ్లినట్లు తెలిసింది. ఇళ్లల్లో యజమానులు విలువైన వస్తువులు ఏవీ ఉంచకపోవడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులే ఎవరైనా ఈ చోరీలకు పాల్పడి ఉండవచ్చునని అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేశారు. సోమవారం రాత్రి ఘటన జరిగితే బుధవారం ఉదయం వెలుగు చూసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో

నిందితుడికి ఏడేళ్ల జైలు

నిర్మల్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం రామారావుబాగ్‌లో నివాసముంటున్న 70 ఏళ్ల చంద్రబాగపై అదే ప్రాంతంలో నివసిస్తున్న సాకే లక్ష్మణ్ హత్యాయత్నానికి పాల్పడినట్లు నేరం రుజువుకావడంతో బుధవారం అసిస్టెంట్ సెషన్ జడ్జి జి.శ్రీనివాస్ ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, 2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. 2 అక్టోబరు 2003న ఈ సంఘటన చోటుచేసుకుంది. నిందితుడు బాధితురాలు పక్కపక్కనే నివసిస్తున్నారు. భార్య పిలుస్తదని రప్పించి మద్యం కోసం డబ్బులు అడుగగా నిరాకరించింది. నిందితుడు ఆమెను చంపి నగలు దోచుకోవాలని భావించి చున్నీతో ఉరి వేయడానికి ప్రయత్నించాడు. బాధితురాలి అక్క అక్కడికి రాగానే నిందితుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. అనదపు పబ్లిక్ ప్రాసిక్యేటర్ వై.రమణారావు 12 మంది సాక్షుల ను విచారించగా నేరం రుజువైంది. లైజన్ అధికారి డల్లుసింగ్ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



విఠల్ మృతదేహం

భైంసా రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన బెంద్రి విఠల్(60) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేవాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మంగళవారం గ్రామ పోచమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఏఎస్సై మారుతి తెలిపారు. మృతుడికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



ఉద్యమం సందర్భంగా సోనాల మండలం ఏర్పాటు కోసం డిమాండ్ చేస్తున్న యువకులు (ఫైల్)

పట్టు పట్టి సాధించుకున్నారు!!

- ఓ వైపు ఉద్యమం మరో వైపు రాజకీయం
- సోనాల మండలంగా ఏర్పాటు.. గ్రామస్థుల హర్షం

బోథ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సోనాల మండలం ఏర్పాటు కోసం గ్రామస్థులు పట్టు వీడలేదు. గతంలో ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చాలంటూ గ్రామస్థులు చుట్టూ పక్కల గ్రామాల వారు కలిసి 75 రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అప్పటి నుంచి ఉద్యమం ఉధృతం చేస్తూ వచ్చారు.

ప్రభుత్వం మారడంతో ఆందోళన

ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రభుత్వం మారడంతో నెరవేరుతుందో లేదోనని మండలం ఏర్పాటు సాధ్యమేనా అనే విషయమై సోనాల గ్రామస్థులతో పాటు చుట్టూ పక్కల గ్రామాల వారు ఆందోళన వ్యక్తపరిచారు. అయితే రాజకీయంగా గ్రామానికి చెందిన వారు పావులు కలపడంతో పాటు రాష్ట్రస్థాయిలో మంత్రులకు విన్న వించారు. అయితే గ్రామం నుంచి అధికార ప్రతిపక్ష నాయకుల ఒత్తిడితో పాటు మండలం కోసం లాబీయింగ్ జరిగింది. అయితే ఇచ్చిన హామీ మేరకు మండలం ఏర్పాటు కోసం గ్రామస్థాయిలో ఉన్న నాయకులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో మండలం ఏర్పాటు కోసం గ్రామస్థాయి నాయకులంతా రాష్ట్ర స్థాయిలో మండలం కోసం ఒత్తిడి తీసుకురాక తప్పలేదు.

కోడ్ ఇవ్వడంతో చిగురించిన ఆశలు

ఇటీవల నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో సోనాల మండలంగా నిర్ధారిస్తూ 19 కోడ్ నెంబర్‌ను ఇవ్వడం జరిగింది. దీంతో మండలం ఏర్పాటు ఖాయమని గ్రామస్థుల్లో ఆశలు చిగురించాయి. దీంతో పాటు ప్రభుత్వం మండల ఏర్పాటు కోసం జీవో నెం.7 ద్వారా మండల ఏర్పాటు ప్రక్రి య కోసం ఆదేశాలు వెలువడ్డాయి. అయితే ఇక ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుపైన ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

మా ఆకాంక్ష నెరవేరింది : సాధన కమిటీ

తమ గ్రామం మండలంగా ప్రకటించాలని 75రోజుల దీక్షలు చేపట్టాం. అయితే ప్రభుత్వం మా ఆకాంక్షను మా డిమాండ్‌ను నెరవేర్చిందని సోనాల మండల సాధన కమిటీ అధ్యక్షుడు రామ్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు జీవీ.రమణతో పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న అరుణ్‌కుమార్‌తో పాటు గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, యువకులు పట్టుబట్టి పోరాడటంతో మండలం ఏర్పాటువుతుందన్నారు. అంతేకాకుండా రాజకీయపరంగా సహితం నాయకులు కృషి చేయడం యువకులు సహకరించడం మర్చిపోలేమన్నారు. ఏదిఏమైనా మండలం ఏడడంతో మాకల నెరవేరింది అని సోనాల మండల సాధన కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోసాయి అడవుల్లో సంచరిస్తున్న అరుదైన గద్ద

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన చాంగే బుల్ హక్ గద్ద

తలమడుగు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లాలో చాంగే బుల్ హక్ అనే అరుదైన గద్ద సంచరిస్తోంది. పెద్దపెద్ద కళ్లు, నెత్తి మీద పెద్ద పింఛం, గంభీరమైన శరీరం కలిగిన ఈ గద్ద చూసేందుకు భయంకరంగా కనిపిస్తుంది. ఈ గద్ద ఉడుములు, పాములతో పాటు ఇతర పలు వన్య ప్రాణులను వేటాడి తింటుంది. సాధారణంగా ఇలాంటి గద్దలు చిన్న చిన్న అడవుల్లో కనిపించదు. అభయారణ్యాలు, పులులు సంచరించే ప్రాంతాలతో పాటు టైగర్ రిజర్వు ఫారెస్టులలో మాత్రమే కనిపిస్తాయి. ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం కోసాయి అడవుల్లో బుధవారం ఈ గద్ద ప్రత్యక్షమైంది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగపల్లి కృష్ణ ఈ గద్ద చిత్రాలను తన కెమెరాలో బంధించాడు.

విమానాశ్రయంపై చిగురిస్తున్న ఆశలు

- రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- మళ్లీ తెరపైకి వస్తున్న జిల్లా ఎయిర్‌పోర్టు నిర్మాణం
- ఇటీవలే కేంద్ర మంత్రిని కలిసి విన్నవించిన ముఖ్యమంత్రి
- ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న జిల్లా వాసులు

ఆదిలాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విమానాశ్రయంపై జిల్లా ప్రజలకు మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో మూడు కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాలోనూ ఎయిర్‌పోర్టును నిర్మించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా విమానాశ్రయం కళ ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత కుదరక పోవడంతో ఆచరణ సాధ్యం కాలేదు. దీంతో జిల్లా వాసులకు గాలిమోటర్ ఆశలు కళగానే మిగులుతు వచ్చాయి. ప్రతిసారి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు విమానాశ్రయ నిర్మాణ విషయాన్ని ప్రధాన ప్రచారస్త్రంగా చేసుకుని ఎన్నికల్లో గట్టెక్కడం పరిపాటిగా మారింది. ఎన్నికల తర్వాత ఆ విషయాన్నే పూర్తిగా మరిచి పోవడంతో విమానాశ్రయ నిర్మాణం అందని ద్రాక్షగానే మారింది. అయితే ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయాన మంత్రి కె.రాంమోహన్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాకు ఎయిర్‌పోర్టును మంజూరు చేయాలని కోరడంతో మళ్లీ ఎయిర్‌పోర్టు నిర్మాణం చర్చలోకి వచ్చింది.



- గతంలో సర్వే చేసేందుకు జిల్లాకు వచ్చిన రక్షణ శాఖ హెలీక్యాప్టర్ (ఫైల్)



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఎయిర్‌పోర్టును నిర్మించే స్థలం ఇదే..

పదేళ్ల క్రితమే స్థల సేకరణ

గతంలో వైమానిక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర రక్షణశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా అధికారులు 369.50 ఎకరాల స్థలాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీనికి అదనంగా మరో 2వేల ఎకరాల స్థలం అవసరమని కేంద్ర ప్రభుత్వం సూచించడంతో 1590.05 ఎకరాల స్థలాన్ని పట్టణ శివారు ప్రాంతంలోని అనుకుంట, ఖానాపూర్, కచికంటి, తంతోలి గ్రామాల పరిధిలో గుర్తించారు.ఈ స్థల సేకరణకు ప్రస్తుతం సుమారుగా రూ.438.67కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలుస్తుంది.

రక్షణ శాఖ అనుమతులే కీలకం

ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టును నిర్మించేందుకు కేంద్ర రక్షణ శాఖ అనుమతులు కీలకంగా మారనున్నాయి. అయితే గతంలోనూ జిల్లా నేతలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేశారు. కానీ రక్షణ శాఖ అనుమతులు ఇవ్వక పోవడం ఆటంకంగా మారుతుందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాకేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అన్నిరకాల అవకాశాలతో పాటు అనుకూలతలు ఉన్నా.. కేంద్ర రక్షణ శాఖ పరిధిలోని అంశం కావడంతో కొంతజాప్యం జరుగుతోందని అంటున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను కలిసి విన్నవించడంతో ఈ విషయంలో కొంత కదలిక వచ్చినట్లు కనిపిస్తుంది.అన్ని రకాల అనుమతులు వస్తే ఈసారి ఎయిర్‌పోర్టు నిర్మాణం ఖాయమేనన్న అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రతీ వారం తనిఖీలు చేపట్టాలి

- ఆహార భద్రత కమిటీతో ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఆహార భద్రత కమిటీతో ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రతి పాఠశాల, కళాశాల, హాస్టల్, రెసిడెన్షియల్, ఆసుపత్రిని సందర్శించాలన్నారు. ప్రతి వారం తప్పకుండా తనిఖీ నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు వివిధ శాఖల అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, అన్ని సంస్థలలో ఆహారాన్ని అందించేందుకు ప్రమాణాలతో కూడిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్‌ను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మల్టి డిసిప్లనరీ టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేసి గత రెండేళ్లలో ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగిన హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి సంఘటనలకు గల కారణాలను, సమస్యలకు పరిష్కారాలు చూపాలని ఆహార భద్రత కమిటీని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రభుత్వ హాస్టళ్లు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆహార పదార్థాల నిల్వ, వంట పాత్రలను శుభ్రం చేయడం, ఆహారాన్ని వడ్డించడం వరకు ప్రతిది క్షుణంగా అధికారులు తనిఖీ చేపట్టాలని పేర్కొన్నారు. వంట చేసే వ్యక్తుల హైజింగ్, వారి ఆరోగ్యం ఎలా ఉంది పరిశీలించాలన్నారు. భవిష్యత్తులో హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, గురుకులాలు, కేజీబీవీలు, హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించే విధంగా చూడాలని సూచించారు. అంతేకాకుండా భోజనం అందించే ప్రాంతం, వంట పాత్రలు, వంట వండే ప్రాంతం పరిశుభ్రంగా ఉందా లేదా విద్యార్థులకు అందించే నాణ్యమైన పౌష్టికాహారం భోజనంపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని హాస్టల్స్‌లో భోజనం అందించే విధానాన్ని పర్యవేక్షణ చేసి ప్రతి రోజు నివేదికను అందించాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలన ప్రతీఒక్కరి బాధ్యత

తలమడుగు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని సైబర్ డీఎస్పీ హసీబుల్లాఖాన్ అన్నారు. మండలంలోని బరంపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం సూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై అంజమ్మ, ఆదిలాబాద్ సైబర్ డీఎస్పీ హసీబుల్లాకాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం తలమడుగు ఎస్‌ఐ అంజమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెం.1098కు ఫోన్ చేసి బాల్య వివాహాలు నిర్మూలించాలని తెలిపారు. అనంతరం ఆదిలాబాద్ సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లాఖాన్ మాట్లాడుతూ బ్యాంకింగ్ పాస్ వర్డ్, ఏటీఎం, ఫోన్ బ్యాంకింగ్, పిన్, కార్డు నంబర్‌ను ఎవరితోనూ పంచుకోవద్దని, అలాగే సులభమైన పాస్ వర్డ్, పాస్ వర్డ్ రికవరీ సెట్టింగ్‌లలో సులభంగా సమాధానం ఇవ్వగల ప్రశ్నలను చేర్చవద్దన్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్‌కు పాల్పడితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1903కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం సూర్ స్వచ్ఛంద సంస్థ మండల కో ఆర్డినేటర్ సంపత్ కిరణ్ మాట్లాడుతూ 2030 వరకు భారతదేశంలో బాల్య వివాహాలను నియంత్రించాలనే ఉద్దేశంతో సూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీలో బాల్య వివాహ రహిత భారతదేశం అనే కార్యక్రమం లాంచ్ చేయడం జరిగిందని, అందులో భాగంగానే ఈ రోజు పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, గ్రామ పెద్దలు కేదారేశ్వర్‌రెడ్డి, సైబర్ క్రైమ్, టీమ్ సభ్యులు రియాజ్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ

అటకెక్కిన ఈ-నామ్

(5వ పేజీ తరువాయి...)

నాణ్యత పరీక్షలు చేసేందుకు అవకాశం లేకుండా పోయిందంటున్నారు. అయితే సోయా, కంది పంటలను మార్కెట్‌లో కుప్పలు పోసి అమ్ముతున్న ఈ-నామ్ విధానాన్ని అమలు చేయడం లేదు. ఇప్పటి వరకు నాణ్యత ప్రమా ణాలను నిర్ణయించే కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో పాటు అవసరమైన నాణ్యత పరికరాలు కూడా అందుబాటులో లేవని అధికారులు చెబుతున్నారు. అలాగే రైతులు మార్కెట్‌కు తరలించిన పంటను పరిశీలించేందుకు కొంత సమయం పడు తుంది. దీనికి సరిపడా మార్కెట్ యార్డు స్థలం కూడా అందుబాటులో లేకపోవడంతో ఈ-నామ్ విధానం అమలుకు ఆటంకంగా మారిందంటున్నారు. అంతేకాకుండా అకస్మాత్తుగా కురిసే వర్షాలకు పంట ఉత్పత్తులను కాపాడుకునేం దుకు సరిపడా గిడ్డంగి వసతులు కూడా లేకపోవడం మరో కారణంగా అధికారులు చెబుతున్నారు. మొత్తానికి జిల్లాలో ఈ-నామ్ విధానాన్ని అమలు చేసేందుకు అధికారులకు అంతగా ఆసక్తి ఉన్నట్లు కనిపించడం లేదంటున్నారు.

నామ్‌తో కలిగే లాభాలు

ఈ-నామ్ విధానంతో రైతులకు ఎన్నో లాభాలు కలుగడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర దక్కే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రైతులు పండించిన పంటను స్థానిక మార్కెట్‌లోనే కాకుండా దేశంలోని ఇతర మార్కెట్లలో కూడా అమ్ముకునే అవకాశం ఉంది. దేశంలోని ఇతర మార్కెట్లలోని ధరల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. రైతు పండించిన పంటకు ఆన్‌లైన్ విధానంతో ట్రేడర్ల పోటీ పెరగడంతో అధిక ధర లభించే అవకాశం ఉంటుంది. కచ్చితమైన తూకాలు రైతులకు నచ్చిన ధరకే పంట దిగుబడులను అమ్ముకునే వీలుంటుంది. నగదు లావాదేవీలకు ఆస్కారం లేకుండా వ్యాపారస్థులు నేరుగా రైతుల బ్యాంకు అకౌంట్‌లలోనే డబ్బులు జమ చేయవచ్చు. తక్కువ సమయంలోనే పంటను అమ్ముకొని ఇంటికి తిరిగి వెళ్లే అవకాశం ఉంది. వ్యాపారస్థులు సిండికేటు అయ్యే అవకాశం ఉండదు. అలాగే ఎలాంటి మోసాలు, ధరల్లో కోతలకు తావుండదు.

క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి : డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ సూచించారు. జిల్లా క్షయ నివారణ అధికారి సుమలతతో కలిసి జిల్లా క్షయ నివారణ కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లాలో టీబీ నివారణకు సిబ్బంది చేపట్టాల్సిన కార్యాచరణ గురించి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా టీబీ వైద్యాధికారిని సాయిప్రియ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో అగస్త్య ఇంటర్‌నేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, జిల్లా విద్యా శాఖ కార్యాలయ ప్లానింగ్ కోఆర్డినేటర్ జె.నారాయణ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, ఫిజిక్స్‌కు సంబంధించి ప్రయోగాలను చూసి వారిలో శాస్త్రీయ దృక్పథం, మూఢనమ్మకాలను పారదోలడం, సైన్స్ పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కంటె నర్సయ్య, సువార్త, పవన్, సీఆర్‌పీ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

భీంపూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నిపాని గ్రామానికి చెందిన ఈరిగెల ఆశన్న-నర్సమ్మ దంపతుల కుమారుడు అరిగేల మణికంఠ (25) అనే యువకుడు ఇటీవలే మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి నర్సమ్మ చేను పనులు ముగించుకుని ఇంటికి రాగా కొడుకు దూలానికి ఉరి వేసుకుని గమనించి ఒక్కసారిగా కేకలు వేయగా, స్థానికులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

మావల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరిని పట్టుకుని అరెస్టు చేసినట్లు సీఐ ఫణీందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న పట్టణంలోని టీచర్స్ కాలనీలో ప్రవీణ్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని ప్రవీణ్ మావల స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మావల ఎస్సై విష్ణువర్ధన్ దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో బంగారుగూడకు చెందిన మాలీకర్ గజానంద్, సీనోళ్ల నారాయణలు పట్టుకొని వారి నుంచి 40 తులాల వెండి, రాగి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇందులో మావల ఎస్సై విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికార, పాలక వర్గాల వైఫల్యంతోనే కొత్త మండలాల ఏర్పాటులో ముథోల్‌కు మొండిచేయి

- బీఆర్‌ఎస్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధుల ధ్వజం

భైంసా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికార, పాలక వర్గాల వైఫల్యాలతోనే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన కొత్త మండలాల ఏర్పాటు జాబితాతో ముథోల్ నియోజకవర్గానికి మొండి చేయి దక్కిందని బీఆర్‌ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ధ్వజమెత్తింది. బుధవారం స్థానికంగా బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు డా. కిరణ్ కోమ్రేవార్, విలాస్ గాదేవార్‌లు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని కుబీర్ మండల పరిధిలోని మాలేగామ్, తానూర్ మండల పరిధిలోని బెల్‌తరోడా గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసిందన్నారు. అయితే రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ సర్కార్ తాజాగా 32 కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసారని అందులో ముథోల్ నియోజకవర్గ పరిధిలోని మాలేగాం, బెల్‌తరోడాకు చోటు దక్కలేదని వివరించారు. ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ అనుసరిస్తున్న అలసత్వ విధానాలు, నిర్లక్ష్యపూరిత వైఖరుల మూలంగానే నియోజకవర్గ పరిధిలో కొత్త మండలాల ఏర్పాటు జరుగలేదని ఆరోపించారు. వచ్చే నెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో సంబంధిత విషయాన్ని ప్రస్తావించి కొత్త మండలాలను సాధించాలని సూచించారు.పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివాస్‌ను పార్టీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో పార్టీ ప్రతినిధులు దేవిదాస్, రావుల పోశెట్టి, రాజన్న, గౌతంతో పాటు పలువురు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత : ఎఫ్ఎస్‌వో

మామడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ అటవీ సంరక్షణ బాధ్యతగా అలవర్చుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం కప్పన్‌పల్లి, దిమ్మదుర్తి గ్రామాల్లో అటవీ హక్కులపై అటవీపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ అటవీలో అక్రమంగా చెట్లను కొట్టడం గానీ వన్యప్రాణులను వేటాడడం గానీ చట్టరీత్యా నేరమని, అటవీహక్కును ఉల్లంఘించినందుకు తగిన చర్యలు ఉంటాయని ఆమె అన్నారు. పంట చేన్ల కోసం జంతువులను హతమార్చడం నేరమని, ప్రతి ఒక్కరూ పంట రక్షణ కోసం సోలార్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో స్వాతి, అటవీ సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల వివరాలను సరైన క్రమంలో కంప్యూటరీకరించాలి

ఖానాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల వివరాలను సరైన క్రమంలో కంప్యూటరీకరించాలని నిర్మల్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కుల గణన సర్వే తాలూకు నిర్వహిస్తున్న కంప్యూటర్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ నెల 30వ తేదీ లోపు డాటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా డాటా ఎంట్రీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు.

ఇథనాల్ పరిశ్రమను తరలిస్తాం.. లేకుంటే రద్దు చేస్తాం!

- ప్రజలకు మంత్రి సీతక్క హామీ
- ఆందోళన విరమించిన దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్థులు
- సంబరాలు చేసుకున్న గ్రామస్థులు



పరిశ్రమ రద్దు సమాచారంతో మహిళా రైతుల ఆనందం

దిలావర్‌పూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏడాదికాలంగా నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరి శ్రమకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రజా ఆందోళనకు మంత్రి సీతక్క హామీతో బుధవారం రాత్రి తెరపడింది. ఇథనాల్ పరిశ్రమను దిలావర్‌పూర్ నుంచి తరలిం చడమా, లేనిపక్షంలో రద్దు చేయడమా.. అన్నది ఏదో ఒకటి తప్పకుండా చేస్తామని మంత్రి సీతక్క ఫోన్‌లో ప్రజలకు హామీ ఇవ్వడంతో.. వారు ఆందోళన విరమించారు. గత రెండు రోజులుగా దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకీషర్మిలలు పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించారు. బుధవారం ఉదయం దిలావర్‌పూర్‌లో మరోమారు ప్రజలు ఆందోళన చేసిన దృష్ట్యా.. పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఏర్పడింది. దీంతో నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల విషయాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కలెక్టర్ ప్రత్యేకచొరవ తీసుకొని దిలావర్‌పూర్, గుండంపల్లి రైతులతో సాయంత్రం నిర్మల్ కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరించారు. దీంతో ఆందోళనలో భాగంగా రైతులపై పెట్టిన కేసులను సైతం ఎత్తివేయాలని కోరగా.. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించారు. వెంటనే కలెక్టర్‌తో జరిగిన చర్చల వివరాలను సమావేశంలో పాల్గొన్న రైతులు దిలావర్‌పూర్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలకు, ఆయా గ్రామాల రైతులకు వివరించారు. ఆ వెంటనే జిల్లా ఎస్పీ జానకీషర్మిల సైతం దిలావర్‌పూర్‌కు చేరుకున్నారు. తప్పకుండా ఇథనాల్ పరిశ్రమ రద్దవుతుందని చెప్పారు. ఇకపై వదంతులను నమ్మవద్దని కోరారు. తాము ఈ విషయాన్ని ఎట్లా నమ్మాలని గ్రామస్థులు ప్రశ్నించగా.. ఎస్పీ అక్కడి నుంచే రాష్ట్ర మంత్రి సీతక్కతో ఫోన్‌లో మహిళలతో మాట్లాడించారు. ఆందోళన విరమించాలని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలను మంత్రి కోరారు. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించడమా, లేకుంటే రద్దు చేయడమా.. అన్న విషయమై ఏదో ఒకటి తప్పకుండా చేస్తామని మహిళలకు మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. దీంతో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్థుల సంబరాలు మిన్నంటాయి. పెద్ద ఎత్తున బాణ సంచా పేల్చడంతో పాటు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. తమకు సహకరించిన మంత్రి సీతక్కతో పాటు కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి సీతక్కతో ఫోన్‌లో మాట్లాడిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు నిలిపి వేశాం : కలెక్టర్

నిర్మల్(ఆంధ్రజ్యోతి): దిలావర్‌పూర్ మండలంలోని ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను నిలిపి వేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపా రు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. అసత్య వార్తలు, పుకార్లు ప్రచారం చేసేవారిపై చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

సంయమనంతో వ్యవహరించాం.. సీఎం జోక్యంతో పరిష్కారం : ఎస్పీ

నిర్మల్ కల్చరల్(ఆంధ్రజ్యోతి): ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అక్కడి ప్రజలు రెండు రోజులుగా చేస్తున్న ఆందోళన సందర్భంగా పోలీసుశాఖ సంయమనంతో వ్యవహరించిందని ఎస్పీ జానకి షర్మి ల తెలిపారు. బుధవారం ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క కలుగజేసుకొని రైతుల సమస్యపై సాను కూలంగా నిర్ణయం తీసుకుని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇది హర్షణీయమన్నారు. బాధిత రైతులు, గ్రామస్థులు సమస్యలు తలెత్తినప్పుడు విద్రోహకారులకు అవకాశం ఇవ్వకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. మంగళవారం రాత్రి ఆర్డీవో రత్నకల్యాణిని ఘెరావ్ చేయడంతో అస్వస్థతకు గురయ్యారని, ఇది గమనించి రోప్ పార్టీతో వెళ్లి ఆమెను బయటకు తీసుకొచ్చామని తెలిపారు. ఆర్డీవో వాహనాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిం చగా.. అడ్డుకున్నామన్నారు. 61 జాతీయ రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో సిర్గాపూర్, నర్సాపూర్, కల్లూర్, తదితర చోట్ల ట్రాఫిక్ దారి మళ్లించా మన్నారు. బుధవారం పోలీసుల శాఖ శాంతియుతంగా వ్యవహరించిందన్నారు. పరిస్థితి చేయి దాటిపోకుండా ఉండేందుకు కొంతమందిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. గ్రామస్థులు పోలీసులపై రాళ్లు రువ్వినా లాఠీచార్జ్ చేయలేదని తెలిపారు.

ఆందోళన చెందవద్దు... అండగా ఉంటా : ఎమ్మెల్యే ఏలేటి

నిర్మల్(ఆంధ్రజ్యోతి): ఎవరూ ఆందోళన చెందవద్దని, తాను అండగా ఉంటానని దిలావర్‌పూర్ మండల ప్రజలకు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మీడియా ముఖంగా హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధ వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం ఆగిపోయేలా మీతో కలిసి పోరాడుతానన్నారు. మీ నిర్ణయం ఏదైనా మీతోనే నేను ఉంటానని దిలావర్‌పూర్ మండల ప్రజలకు హామీ ఇస్తు న్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే దిలావర్‌పూర్ మండల ప్రజలతో కలిసి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తానన్నారు. పరిశ్రమల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, ప్రజలు సంయమనం పాటించి శాంతి యుతంగా పోరాడాలన్నారు. పోలీసు అధికారులు రైతులపై ఎటువంటి కేసులు పెట్టవద్దని కోరారు. పరిశ్రమ పనులను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అనివార్య కారణాల వల్ల తాను అందుబాటులో లేని కారణంగానే రైతుల వద్దకు రాలేకపోతున్నానని.. త్వరలోనే రైతులందరినీ కలుస్తానని పేర్కొన్నారు.

నిరాధార ఆరోపణలు చేయొద్దు : డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్(ఆంధ్రజ్యోతి): కొంతమంది ఉద్దేశపూర్వకంగా చేస్తున్న నిరాధార ఆరోపణలు సరికావని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా దిలావర్‌పూర్ మండలంలో ప్రస్తుతం నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి, తమ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతిస్తే, ప్రస్తుత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తన భూములను అప్పగించి వత్తాసు పలికారన్నారు. ఎన్నికల సమయంలో సైతం తాను గడప గడపకూ తిరిగి ఈ ఫ్యాక్టరీకి సంబంధించిన అంశాలను ప్రజల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఆ ఫ్యాక్టరీ నిర్మాణానికి వత్తాసు పలికిన వారికి వారు పట్టం కట్టారన్నారు. ఎన్ని కల్లో ఓడినా.. గెలిచినా.. తాను నిరంతరం ప్రజల పక్షాన పోరాడే వ్యక్తినన్నారు. తనపై నిరాధార ఆరోపణలు చేయవద్దని, తాను నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తానని శ్రీహరిరావు స్పష్టం చేశారు.




ఫోకస్

- 32 గ్రామాల్లో సోలార్ కరెంటు సరఫరాకు టెట్‌కోతో సర్కారు ఒప్పందం
- గిరిజనుల ఇళ్ల కోసం స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్స్ పథకం ద్వారా రూ.25 కోట్ల నిధులను మంజూరు చేసిన కేంద్రం
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో వెయ్యి గృహాల నిర్మాణం

గిరిజన పల్లెల్లో సోలార్ వెలుగులు!

గిరిజన గ్రామాల్లో సోలార్ వెలుగులు జిగేల్‌మంటున్నాయి. తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి (టెట్‌కో) సంస్థ ద్వారా సోలార్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో ఆదిమ గిరిజనులకు గృహాలు మంజూరు చేయడం లేదని భావించిన కేంద్ర ప్రభుత్వం స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్స్ పథకం ద్వారా రూ.25 కోట్లతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కోలాం, తోటి గిరిజనులకు 1000 గృహాలు మంజూరు చేసి నిర్మాణం చేపడుతోంది.

ఉట్నూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఆదిమ గిరిజనులకు గృహాలు మంజూరు చేయడం లేదని భావించిన కేంద్రప్రభుత్వం స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్స్ పథకం ద్వారా రూ.25 కోట్లతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కోలాం, తోటి గిరిజనులకు 1000 గృహాలు మంజూరు చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, సిరికొండ, గుడిహత్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్, బేల, మావల, జైనథ్, ఆదిలాబాద్ మండలంలో ఆదిమ గిరిజన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించారు. ఆదిలాబాద్ జిల్లాలోని 105 గ్రామాల్లో 486 మందికి, ఆసిఫాబాద్ జిల్లాలో జైనూర్, లింగాపూర్, వాంకిడి, తిర్యాని మండలంలో 296 మందికి, మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండెపల్లి, లక్షెటిపేట, తాండూర్, కాసిపేట మండలాల్లో 128మందికి, నిర్మల్ జిల్లాలోని పెంబ్లి, ఖానాపూర్, మామడ, నిర్మల్, సారంగాపూర్ మండలాల్లో 90 మందికి గృహాలు మంజూరు చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు కేటాయించడంతో ఆయా గ్రామాల్లో అత్యవసరమైన లబ్ధిదారులను గ్రామస్థులు గ్రామసభలలో గుర్తించి వారికే ఇళ్లు కేటాయించారు. లాభక్షులు సొంతంగా పనులు చేసుకుంటూ నిర్మించుకుంటున్నారు. ఉట్నూర్ మండలంలోని చెరువు గూడెం, మొర్రిపేట్, జెండాగూడ, లక్కారం నవోదయనగర్, కుమ్మరికుంట, సోనాపూర్, కోలాంగూడ, మణిగూడ, రాజంపేట, బొప్పరికుంట, ధర్మాజీపేట్ గ్రామాలలో గృహ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

• 32 గ్రామాలకు సోలార్ వెలుగులు

ఉమ్మడి జిల్లాలోని కరెంట్ లేని 32 గ్రామాల గిరిజనులకు ప్రభుత్వం సోలార్ వెలుగులు అందుబాటులోకి తెస్తోంది. 32 గ్రామాల్లో 800 కోలం, తోటి గిరిజన కుటుంబాలను గుర్తించి ఒక్కో గ్రామానికి రూ. 68.49 లక్షలు వెచ్చించి తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి (టెట్‌కో) సంస్థ ద్వారా సోలార్ వెలుగులు కల్పిస్తోంది. ఐదేళ్ల వరకు ఎలాంటి మరమ్మతులు వచ్చినా టెట్‌కో అధికారులు చూసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

• దశాబ్దాలుగా వెనుకే..

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా అడవులకే పరిమితమై జీవనం సాగిస్తున్నారు ఆదిమ గిరిజనులు. ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి కోసం ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటైన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా కూడా గిరిజనులకు జరిగిన అభివృద్ధి అంతంతే. ఉమ్మడి జిల్లాలో 177 గ్రామాల్లో ఆదిమ గిరిజనులైన కోలాం, తోటి గిరిజనులు జీవిస్తున్నారు. కొండా కోనల్లో సరైన రోడ్లు కూడా లేని మారుమూల గ్రామాల్లో ఏరి పారివేసినట్లు ఆదిమ గిరిజనులు బతుకుతున్నారు. కోలాం గిరిజనులు బుట్టలు, తడకలు, అల్లుతూ పోడు వ్యవసాయం చేస్తూ జీవిస్తుండగా తోటి గిరిజనులు ఇంకా సంచార జీవనం సాగిస్తూ గిరిజన గ్రామాల్లో కథలు చెబుతూ వారు ఇచ్చే ధాన్యంతో పొట్టు నింపుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే కొందరు ఆదిమ గిరిజనులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్చి చదివిస్తున్నారు. ఈ గ్రామాలకు రోడ్లు, మంచినీరు, వ్యవసాయ భూములకు సాగునీరు, కరెంట్ అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశీలకులు అంటున్నారు.

• ఉమ్మడి జిల్లాలో కరెంట్ లేని గ్రామాలు 32

ఆదిమ గిరిజనులు జీవిస్తున్న అటవీ ప్రాంతాల్లో 32 గ్రామాలకు నేటికీ కరెంట్ సౌకర్యం కరువైంది. ఆదిలాబాద్ జిల్లా లోని ఇంద్రవెల్లి మండలం శాంతిగూడ, రామగూడ, సిరికొండ మండలం ధర్మన్నపేట్, బుర్సిగుట్ట, ఉట్నూర్ మండలం మారుతిగూడ, సెంటర్‌గూడ, ఒంటిమామిడి, ఎర్రగుట్ట, ధర్మాజీపేట్, శాంతాపూర్, రాజులగూడ, మావల మండలం మాలేపూర్, ఆదిలాబాద్ మండలం నిపానిగుట్ట, నార్నూర్ మండలం బొజ్జిగూడ, గాదిగూడ మండలం న్యూభీంజిగూడ, జైనూర్ మండలం దేవుగూడ, లామ్‌పటార్, కెరమెరి మండలం రాజులగూడ, పట్నాపూర్, వాంకిడి మండలం తాటిగూడ, బోలపటార్, జోగాపూర్, ఆసిఫాబాద్ మండలం మాన్కపూర్ కాలనీ, అన్నారం దేవదుర్గం చింతగూడ, బిర్యాని మండలం కుర్సిగూడ బురదమడుగు, దోనికి సిర్పూర్‌టి మండలం వేంపల్లి కోలంగుడ, కాగజ్‌నగర్ మండలం కోలాంగోంది, పెంబి మండలంలోని గుమ్మెన కులంగుడలాంటి ఆదిమ గిరిజనులు జీవిస్తున్న గ్రామాలకు కరెంట్ కరువైంది.



• మొర్రిపేట్‌లో కోలాం గిరిజనుల ఇళ్లు



ఇళ్లు నిర్మాణంలో ఉంది



• మడావి సునిత, కోలాంగూడ

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఐటీడీ అధికారుల ఆధ్వర్యంలో మంజూరైన ఇళ్లను తామే నిర్మించుకుంటున్నాం. ఇంటికి కావాల్సిన పనులు చేసుకుంటుండగా సిమెంట్ ఇటుక రేకులు ఏర్పాటు చేసుకొని ఇళ్లు నిర్మించుకుంటున్నందుకు ఆనందంగా ఉంది.

గృహాలకు నిధులు మంజూరు చేయాలి



• మాణిక్‌రావు, జిల్లానాయకులు

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 25 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించిన గృహాలకు ఇంకా పూర్తి నిధులు విడుదల కాలేదు. కేంద్ర ప్రభుత్వం పూర్తినిధులు విడుదల చేసి అభివృద్ధికి దూరంగా ఉన్న కోలాం గిరిజనులను ఆదుకోవాలి.





• సోనాపూర్‌లో కోలాం గిరిజనుల కోసం నిర్మించిన గృహం



జర దేఖో!!

నిరుపయోగంగా గిరిజన భవన్ ఫంక్షన్ హాల్

గిరిజన భవన్‌లో..
మంగళవాయిద్యాల చప్పుడెప్పుడో?

- భవన నిర్మాణం పూర్తయిన ప్రారంభానికి నోచుకోని ఫంక్షన్‌హాల్
- వినియోగంలోకి తీసుకువస్తే పేద కుటుంబాలకు ఉపయోగం

ఇచ్చోడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడాలి తొలిగి మంచి ముహూర్తాలు ప్రారంభం కావడంతో కొద్దిరోజులుగా వివాహాది శుభకార్యాల సందడి నెలకొంది. ఒక్కోసారి వేడుకల నిర్వహణకు ఫంక్షన్ హాళ్ల కొరత ఎదురై నిర్వాహకులు వేరే ముహూర్తాలు ఎంపిక చేసుకుంటున్నారు. ఇలాంటి ఇబ్బందులను అధిగమించేలా ఇచ్చోడ పట్టణంలో గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) గిరిజన వేడుకల భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన భవన్ ప్రారంభమెప్పుడో..

ఇచ్చోడ పట్టణంలోని ఐటీడీఏ పెట్రోల్‌బంకు వెనుక ప్రాంతంలో నూతనంగా నిర్మించిన గిరిజన భవన నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.కోట్లతో కల్యాణ వేడుకలకు గిరిజన భవన్ నిర్మించారు. వేడుకల వేదిక, మరుగుదొడ్లు, స్నానపుగదులు, గదులను నిర్మించి నిరుపయోగంగా వదిలేశారు. భవనం నిర్మాణం పూర్తయిన నాటి నుంచి భవనం నిరుపయోగంగా మారింది. ఇచ్చోడ పట్టణంలో మరో ఆరు ప్రైవేటు ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. సొంతిళ్లు లేకపోవడం, ఉన్నా ఇరుకుగా ఉన్న పేద, మధ్య తరగతి వారికి పోటీపడి మరీ వాటిల్లో శుభకార్యాలు జరుపుకునే పరిస్థితి లేదు. ముహూర్తాల సమయంలో ఫంక్షన్‌హాళ్లు చాలడంలేదు. ఇలాంటి తరుణంలో గిరిజన భవనం అందని ద్రాక్షగా మారడంపై ఆదివాసీలు పెదవి విరుస్తున్నారు.

త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం..

• ఐటీడీఏ జేఈ సుధాకర్, ఇచ్చోడ

గిరిజన భవన్‌ను ఇటీవలే ఉన్నతాధికారులు పరిశీలించారు. వినియోగంలో లేకపోవడానికి గల కారణాలు, ముఖ్యసమస్యలను తెలియజేశాం. ఫంక్షన్‌హాల్ నిర్మాణం పూర్తిఅయింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో గిరిజన భవన్‌ను త్వరలో ప్రారంభిస్తాం.



ఐదు క్లాసులకు ఒకే టీచర్..!

ఉట్నూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదు తరగతుల విద్యాబోధనకు ఒకే టీచర్ ఉండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి ఎలా జరు గుతుందని కోలాం గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కుమ్మరికకుంట కోలాం గిరిజన గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ఇటీవల ఉపాధ్యాయుడు శంకర్ ఆకస్మికంగా మృతిచెందడంతో ఆయన స్థానంలో మండల విద్యాశాఖ అధికారులు ఎవరినీ నియమించలేదు. ఇన్నాళ్లూ ఐదు తరగతులకు ఇద్దరే ఉపాధ్యాయులు బోధిస్తూ నెట్టుకు రాగా, ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోధించడం భారంగా మారింది. ప్రతీరోజు విద్యార్థుల అటెండెన్స్ ఫేస్ టు ఫేస్ తీసుకొని ఉన్నతాధికారులకు అప్ లోడ్ చేయడం, ఐదు తరగతుల విద్యార్థుల హాజరు అప్‌లోడ్ చేయడం, ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించడం భారంగా మారింది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి ఐదు తరగతులకు గాను కనీసం ముగ్గురు ఉపాధ్యాయులనైనా ఏర్పాటు చేసి కోలాం గురించి అభివృద్ధికి కృషిచేయాలని గిరిజనులు కోరుతున్నారు.



ఫొటో న్యూస్

విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



ఆంధ్రజ్యోతి పరిశీలన

• క్వారీ గుంతలో పడ్డ వ్యక్తి కోసం గాలిస్తున్న దృశ్యం

• కూతురు గుంతలో పడి మృతి చెందడంతో రోదిస్తున్న తల్లితండ్రులు(ఫైల్)

క్వారీల వద్ద రక్షణ చర్యలేవీ?

- క్వారీల వద్ద ఇష్టారీతిన గుంతలు
- ఇటీవల గుంతలో పడి ఇద్దరి మృతి
- ఇప్పటివరకు కనీస రక్షణ చర్యలు కరువు
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- రక్షణ చర్యలు చేపట్టాలని పిప్రి గ్రామస్థుల వినతి

బజార్‌హత్నూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలో ఉన్న పిప్రి గ్రామం సమీపంలో గల రెండు కంకర క్వారీలలో భాగంగా తీసిన గుంతలు వర్షపు నీటితో నిండి ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే పలుమార్లు పరిసర ప్రాంతాలలోని గ్రామస్థులు రక్షణ చర్యలు చేపట్టాలని కంకరమిషన్ క్వారీల యజామానులకు ఆదేశించినప్పటికీ వారు కనీసం పట్టించుకోవడం లేదు. కొన్నినెలల క్రితం వారం వ్యవధిలోనే ఆ గుంతల్లో పడి ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ప్రమాదాలు జరిగి నెలలు గడుస్తున్నా అక్కడ ఇప్పటివరకు ఎటువంటి రక్షణ చర్యలు అధికారులు చేపట్టకపోవడంతో గమనార్హం. ఇంకా ఎంతమంది ప్రాణాలు బలి తీసుకుంటారని గ్రామస్థులు మండిపడుతున్నారు. కనీసం పట్టించుకోని అధికారులపై ఆగ్రహంతో ఉన్నారు. క్వారీల వద్ద ఏర్పడిన దుమ్ము, ధూళితో సమీప పంటపై పడడంతో పంటలుఏపుగా ఎదుగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని పేర్కొన్నారు.

క్వారీల గుంతల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి

పిప్రి గ్రామ సమీపంలో ఉన్నా రెండు క్వారీల వద్ద ఏర్పడిన బారీ గుంతల వద్ద పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని ఎన్నో రోజులుగా క్వారీ నిర్వాహకులకు చెపుతున్నామని గ్రామస్థులు తెలిపారు. గతంలో గుంతలో పడి పశువులు మృతి చెందిన సంగటనలు ఎన్నో ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. ఇటీవల ఇద్దరు రెండు క్వారీల గుంతలో పడి మృతి చెందడంతో క్వారీల వైపు పశువుల కాపరులు వెళ్లాలంటే జంకుతున్నారు. మనుషుల ప్రాణాలు పోయినా అధికారుల్లో మాత్ర ఎలాంటి చలనం లేకుండా పోయిందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా క్వారీల చుట్టు కనీసం పెన్సింగ్‌ను ఏర్పాటు చేసి పరిసర ప్రాంతాలలో పశువులు రాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.




ఎటువంటి రక్షణ లేకుండా ఉన్న గుంత

క్వారీల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి

• పండుగ మురళి, మాజీ ఎంపీటీసీ, పిప్రి

క్వారీల వద్ద ఏర్పడిన భారీ గుంతల వద్ద పటిష్ఠంగా కంచెను ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరిగి నెలలు గడుస్తున్నా అధికారులు ఇప్పటివరకు అటువైపు చూసినట్లు ఆనవాలు లేవు. ప్రమాదంజరిగి మనుషులు ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ కూడా అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. వెంటనే చర్యలు చేపట్టాలి.





పత్తి బండిని తూకం వేస్తున్న దృశ్యం

- జిల్లాలో సాధ్యం కాదంటూ చేతులెత్తేసిన అధికారులు
- 2016 నుంచి ట్రయల్ బేస్‌లోనే కొనుగోళ్ల ప్రక్రియ
- మళ్లీ పాత పద్ధతిలోనే పంటల కొనుగోళ్లు
- అందుబాటులో లేని నాణ్యత పరికరాలు, సిబ్బంది
- ఆన్‌లైన్ అమ్మకాలపై జిల్లా రైతులకు అవగాహన కరువు
- ఈ విధానంతో అన్నదాతలకు లాభాలతో పాటు గిట్టుబాటు ధర దక్కే అవకాశం
- 2016లో అమల్లోకి వచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం

అటకెక్కిన.. ఈ-నామ్



- జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గల ఈ-టెండర్ హాల్

రైతులు.. పండించిన పంటను దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అమ్ముకునే విధంగా, క్రయవిక్రయాల లో పారదర్శకతను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ వ్యవసాయ మార్కెట్ (నామ్) విధానాన్ని 2016 ఏప్రిల్ 14న అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా 44 మార్కెట్లను, దేశవ్యాప్తంగా గల మార్కెట్లతో అనుసంధానం చేస్తూ మార్కెట్ విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేసింది.

ఆదిలాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మార్కెట్‌లో ఈ-నామ్ విధానం ద్వారా పంటలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేసింది. కానీ ఆన్‌లైన్ పంటల కొనుగోళ్లు జిల్లాలో సాధ్యపడదన్న ఉద్దేశంతో అధికారులు ఈ-నామ్ విధానాన్ని అటకెక్కించారు. మళ్లీ పాత పద్ధతిలోనే పంటల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ విధానంపై రైతుల్లో పూర్తిగా అవగాహన లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఈ-నామ్ విధానాన్ని ప్రారంభించి సుమారుగా ఎనిమిదేళ్లు గడుస్తున్నా.. క్వింటాల్ పంట దిగుబడులను కూడా కొనుగోలు చేయలేదు. ఈ- నామ్ విధానానికి అవసరమైన వసతులు, పరిస్థితులు ఇక్కడ లేవంటూ అధికారులు దీనిని పక్కన పెట్టడంతో అన్నదాతలు దళారుల బారిన పడి నష్టపోతూనే ఉన్నారు.

అధికారుల నిండు నిర్లక్ష్యం

రైతులు నష్టపోకుండా పంటలను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-నామ్ విధానంపై మార్కెటింగ్ అధికారులు నిండు నిర్లక్ష్యమే చూపుతున్నారు. దీంతో గత ఎనిమిదేళ్లుగా ట్రయల్ బేస్ దశను దాటి ముందుకు వెళ్లడం లేదు. అధికారుల అలసత్వం, అన్నదాతల అవగాహన రహిత్యంతో నామ్ విధానం అమలుకు ఆటంకంగా మారింది. ఈ విధానం అమలైతే దేశవ్యాప్తంగా పంటలకు డిమాండ్ ఉన్న చోట విక్రయించుకునే అవకాశం ఉంటుంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కే అవకాశం ఉంటుంది. దళారి వ్యవస్థను నిర్మూలించి నేరుగా రైతు తనకిష్టమైన ధరకు పంట ఉత్పత్తులను అమ్ముకునే విధంగా కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ-నామ్ విధానాన్ని అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మొదట ట్రయల్ బేస్‌గా మొదటి దశలో ఒకే మార్కెట్‌లో జరిగే క్రయవిక్రయాలను నమోదు చేస్తూ కొనుగోళ్లను చేపట్టారు. ప్రస్తుతం దానిని కూడా ఎత్తివేయడంతో పాత పద్ధతిలోనే కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఈ-నామ్ విధానంపై కనీసం రైతులకు అవగాహన కల్పించేందుకైనా మార్కెట్ అధికారులు చర్యలు చేపట్టలేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తూనే ఉంది.

ఇక్కడ సాధ్యం కాదట!!

ఈ-నామ్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రత్యేకమైన ల్యాబ్, సిబ్బందిని నియమించిన జిల్లాలో సాధ్యంకాదంటూ జిల్లా అధికారులు చేతులెత్తేయడంతో సిబ్బంది తిరిగి వెళ్లిపోయారు. దీంతో గతంలో కేటాయించిన కంప్యూటర్ సిస్టమ్స్, తేమ పరికరాలు మూలనపడి మూలుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పరికరాలు ధ్వంసమై అసలు పనికి రాకుండా పోయినట్లు తెలుస్తుంది. రైతులు పండించిన పంట ఏమేరకు నాణ్యతగా ఉందో 9 రకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ మార్కెట్లో కుప్పలుపోసి ఉంచిన పంట దిగుబడులను విక్రయించేందుకే ఈ-నామ్ విధానం అనుకూలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పత్తిని రైతులు వాహనాలలో తీసుకురావడంతో

(తరువాయి 6వ పేజీలో...)





- మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చిన పత్తిబండ్లు

ఈ-నామ్ విధానం ఎంతో మేలు
: బాలూరి గోవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం నేత



రైతులు పండించిన పంటను అధిక ధరకు అమ్ముకునేందుకు ఈ-నామ్ విధానం ఎంతో మేలు. దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లలో జిల్లా రైతులు పంట దిగుబడులను అమ్ముకునే అవకాశం ఉంటుంది. దీంతో పోటీతత్వం పెరిగి ధర దక్కుతుంది. కొంత కష్టమైనా అధికారులు ఈ-నామ్ ద్వారా పంటలను కొనుగోలు చేస్తే రైతులకు లాభదాయంగా ఉంటుంది.

మార్కెట్ యార్డు స్థలం సరిపోదు
: కె.మధుకర్ (మార్కెట్ కమిటీ సెక్రటరీ, ఆదిలాబాద్)



ఈ-నామ్ కొనుగోలు విధానానికి ప్రస్తుతం ఉన్న మార్కెట్ యార్డు స్థలం సరిపోదు. కనీసం వంద ఎకరాలకుపైగా యార్డు స్థలం అందుబాటులో ఉండాలి. రైతుల్లో మరింత అవగాహన పెరగాలి. కుప్పలు పోసిన పంట దిగుబడులను మాత్రమే కొనుగోలు చేయవచ్చు. జిల్లా రైతులు వాహనాలలో పత్తిని తరలిస్తారు. అలాగే వ్యాపారస్థుల్లో పోటీతత్వం ఉండాలి. ఇలాంటి ఇబ్బందుల తోనే జిల్లాలో ఎక్కడ ఈ-నామ్ విధానం అమలుకావడం లేదు.

చిగురిస్తున్న విమాన ఆశలు!

- మళ్లీ తెరపైకి వచ్చిన జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణం
- ఇటీవల ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి



6

పట్టు పట్టి సాధించుకున్నారు!

- సమగ్ర సర్వేలో సోనాల మండలంగా నిర్ధారిస్తూ 19వ కోడ్ జారీ
- 75 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేశాం : సాధన కమిటీ



6

ఐదు క్లాసులకు ఒకే టీచర్!

- ఏజెన్సీలోని మారుమూల కోలాం గిరిజన గ్రామంపై అధికారుల నిర్లక్ష్యం
- విద్యాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్న ఆదివాసీ గిరిజనులు



7



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు

లోక్ అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజీ పడదగిన కేసులు, కుటుంబ కేసులు, బ్యాంక్ కేసులకు లోక్ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం పొందవచ్చని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు తెలిపారు. డిసెంబరు 14న జిల్లావ్యాప్తంగా కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు బుధవారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్యతో కలిసి పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. కక్షిదారులు ఇద్దరు విజయం సాధించడంతో పాటు కోర్టుకు చెల్లించిన రుసుము సైతం తిరిగి చెల్లిస్తారని ఆయన పేర్కొన్నారు.

నేడు పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు జిన్నింగ్‌లు రాఘవేంద్ర, సాయి, దత్త సాయిబాబాలలో పత్తి నిల్వలు పేరుకుపోవడం వల్ల ఈనెల 28న గురువారం పత్తి పంట కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులుపైన తెలుపబడిన జిన్నింగ్‌లకు పత్తిని తీసుకురావద్దని, బోథ్‌లోని స్వప్న జిన్నింగ్‌లో కొనుగోళ్లు యధావిధిగా ఉంటాయని పేర్కొన్నారు.

సోనాల మండలం ఏర్పాటు పట్ల హర్షం

బోథ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సోనాలను మండలంగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తపరుస్తూ సోనాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీనాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు ఇది కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయమని పేర్కొన్నారు. మండల ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి సీతక్క నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. సోనాల మండల ప్రజలు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు గాజుల పోతన్న, సోనాల పట్టణ అధ్యక్షుడు అనిల్, టీసీ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు భోజన్న, నల్ల విజయభాస్కర్‌రెడ్డి, కసిరి పోతన్న, పోశెట్టి, హరిసింగ్, గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

విద్యార్థుల భోజనం పట్ల జాగ్రత్త

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- నేరడిగొండలో కేజీబీవీ ఆకస్మిక తనిఖీ
- గూగుల్ మీట్ ద్వారా అధికారులకు దిశా నిర్దేశం

నేరడిగొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం, అల్పాహారం కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం గూగుల్‌మీట్ ద్వారా సంబంధిత అధికారులు ఆర్డీవో, సీఈవో, డీఆర్‌డీవో ప్రత్యేక అధికారులు ఎంపీడీవో, ఎంపీవో, ఎంఈవో, తదితరులతో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి జిల్లా కలెక్టర్ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ, పోషణ్ చర్చ, సీఎం కప్, ప్రజాపాలన విజయోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్స్, స్కూల్స్‌లలో భోజనం వండడానికి ముందే ప్రతీరోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను పరిశీలించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదనిఆదేశించారు. నేరడిగొండ కేజీబీవీ విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, వాటి కాలపరిమితిని తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? భోజనం నాణ్యతను పరిశీలిస్తున్నారా? అని ఎస్‌వో రజితను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించి నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసినట్లయితే ప్రత్యేక అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతీరోజు ఆహార పదార్థాల నాణ్యతను తప్పనిసరి పరిశీలించాలని ఆదేశించారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడుతూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ఎలా ఉంది, ఇంకా ఏమైనా అవసరం ఉన్నాయా, భోజనం ఎలా ఉంది,అని విద్యార్థులను అడగగా.. డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

- **1 నాటికి సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి**

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన ఇంటింటి కుటుంబ సర్వే సామాజిక, ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే వివరాలను డిసెంబరు 1 నాటికి ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని, కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం నేరడిగొండ ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలలో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలకు అస్కారం లేకుండా ఇంటింటి సర్వే వివరాలను ఒక్కో కుటుంబం వారీగా జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో ఎంట్రీచేయాలని, వివరాల నమోదులో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే అధికారుల దృష్టికి తేవాలని, సకాలంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే సందర్భంగా సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వేగవంతంగా నమోదు చేయాలని, మున్సిపాలిటీలు, మండలాల్లో వివరాల నమోదు జరుగుతుందని, వచ్చేనెల 1వ తేదీ వరకు డేటా ఎంట్రీని పూర్తి చేయాలని ఆదేశించారు. తప్పిదాలకు తావులేకుండా అధికారుల పర్యవేక్షణలో, ఎన్యూమరేటర్ల సమక్షంలో ఆపరేటర్లచే వివరాలు నమోదు చేయించాలని అన్నారు. అనంతరం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జిల్ల కలెక్టర్ రాజార్షిషా సందర్శించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కలీమ్, ఎంపీడీవో, ఎస్‌వో రజిత ఆపరేటర్లు, విద్యార్థులు, మండల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తూ..

గిరిజన గ్రామాల్లో బోథ్ ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పర్యటించారు. మండలంలోని లక్ష్మీపూర్, పీచర, నాగ మల్యాల్ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రచ్చబండ వద్ద కూర్చొని గ్రామస్థులతో ముచ్చటిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి కష్టం వచ్చిన నాకు సంప్రదిస్తే అండగా నిలబడతానని అన్నారు. గ్రామాల సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యేకు గ్రాసమ్థులు, యువకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి గ్రామాల పర్యటనలు చేస్తున్నానని, ప్రధానంగా మారుమూల గిరిజన గ్రామాలపై ప్రత్యేకశ్రద్ధ చూపుతానని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా లేకపోయినా గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేశామని, ఇప్పుడు ఎమ్మెల్యేగా నాపై బాధ్యత కూడా ఉందని కచ్చితంగా గ్రామంలో అడిగిన సీసీ రోడ్లు, ఇతర సమస్యలను వీలైనంత త్వరగానే పరిష్కరిస్తానని మాటిస్తున్నానన్నారు. గ్రామస్థుల కోరిక మేరకు రెండు రోజుల క్రితమే గ్రామానికి రెండు హైమస్ లైట్లను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నేరడిగొండ మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సురేందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

'మాలల సింహగర్జన' పోస్టర్ల ఆవిష్కరణ

నేరడిగొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మాలల సింహ గర్జన పోస్టర్లను బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాల సంఘ నాయకులు మాట్లాడుతూ డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మాలల సింహ గర్జనకు లక్షలాది మాల అనుబంధ కులాలు తరలిరండి సభను విజయవంతం చేయాలని ఆత్మగౌరవాన్ని కాపాడి దళితుల ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

- **విజయవంతం చేయండి : ఎలక రాజు**

బోథ్: డిసెంబరు 1న హైదరాబాద్‌లో జరగనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాలల సంఘం మండల అధ్యక్షుడు ఎలక రాజు, జిల్లా కమిటీ సభ్యులు బొబ్బిలి సుధాకర్‌లు పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా నుంచి మాల సంఘం సభ్యులు తరలిరావాలని కోరారు.